# మాటలు రాని మనిషి



## పెద్దింటి విజయలక్ష్మి

*నూతన వధూవరుల నొకటి చేసినందుకు, గర్వకారణంగా వెలిగిపోతూంది కల్యాణమంటపం.*

తోరణాలు, పూలమాలలు, చుట్టూ అరటి పిలకలు, రంగు రంగుల కాగితాలతో శోభాయమానంగా వున్న ఆ పెళ్లిపందిరిని తిలకించక మానరు ఎవ్వరూ! వద్దన్నా కళ్లకు తగిలే అందమూ, ఆనందమూ అది!

పురోహితుల మంత్రాల రగడతో, మంగళ వాయిద్యాల హోరుతో, అందరూ అక్షింతలు చల్లుతుంటె, పెళ్లికూతురు కల్యాణి మెడలో మూడు ముళ్లతో మంగళ సూత్రం బిగించాడు ప్రభాకర్.

ఆ తర్వాత, అంతకే! అలసిపోయి! తన స్థానంలో వచ్చి కూర్చున్నాడు.

వధూవరుల మొహాల్లో వెల్లి విరుస్తున్న అందం, ఆ పెళ్ళిపందిరి అందంతో పోటీ పడుతున్నట్టుంది కావలసిన మిగతా కొంత తతంగం అంతా కానిచ్చి, పెద్దల వద్ద ఆశీస్సులు పొంది రమ్మని వధూవరులని పంపి, తానొకింత 'రెస్టు' తీసుకోజూచారు పురోహితులవారు

వరుసగా, పెద్దలందరికీ అతి భక్తి శ్రద్ధలతో వంగి నమస్కారాలు చేస్తున్నారు కల్యాణ్, ప్రభాకరులు.

పెళ్ళికి ఆహూతులైనవారిలో ముఖ్యులు రమణరావు, అతని భార్య విమల. వారిద్దరూ కూడా నవ దంపతులనే చెప్పవచ్చు. కల్యాణ్, ప్రభాకరులకన్నా వో నెల 'సీనియర్లు.'

'అందరికీ నమస్కారాలు పెట్టేశా'మని వెళ్ళిపోతున్న వారిని.

"వీరికికూడ దండం పెట్టండి" అని. కూతుర్ని, అల్లుణ్ణి, రమణరావు దంపతుల దగ్గరకు తీసుకొచ్చారు కల్యాణి తండ్రి రామకృష్ణగారు

ఆ యిద్దరూ రామకృష్ణగారి ఆజ్ఞను శిరసావహించారు.

ఆ రెండు జంటల మధ్యా పానకంలో పుడకలా నిలబడ్డ రామకృష్ణగారు.

"ఇతను నాకు మేనల్లుడి వరుస. అసలు




కల్యాణిని మా రమణ్రావుకిచ్చి చేయాల్సింది. కాస్తలో తప్పిపోయింది" అని, పెద్దగొప్పగా అల్లుడితో చెబుతున్నట్టు, అన్నిపళ్ళూ చూపెడుతూ పెద్దగా నవ్వాడు

ఆ మాటతో ప్రభాకర్ ముఖ కవళికలు మారిపోయాయి. ఏదో అవమానాన్ని భరిస్తున్నట్టు అయ్యాడు. తనకేదో ద్రోహం జరిగిపోయిందన్న క్రొత్త ఆలోచన పుదయించిందతనిలో. 'ఇది బలవంతపు పెళ్లేమో' అనుకున్నాడు

తండ్రి అప్రస్తుతపు మాటలకు కల్యాణి మనస్సు దిగులు చెందింది

భర్తలో కలిగిన మార్పును కనిపెట్టింది. రామకృష్ణగారు యింకా ఏదో అనబోతుంటే, "నాన్నా, వూరుకోండి" అని, తండ్రిని మందలించింది మెల్లిగా.

"అదేమిటమ్మా, వున్నదేగా చెప్పాను" అంటూ, తన మాటల చాతుర్యానికి తనకు తానే మురిసిపోతున్నట్టు నవ్వారు.

తండ్రిపట్ల కల్యాణి మనస్సు భగ్గుమని మండింది కానీ, పెళ్ళికూతురన్న తనకో ప్రత్యేకత వున్నది కాబట్టి, ఎక్కువ నోరు విప్పలేక పోతూంది.

ప్రభాకర్ సాలోచనగా ఎటో చూస్తున్నాడు ఇక రమణ్రావుకి కల్పించుకోక తప్పిందికాదు. గొంతు సవరించుకుని.

"ఆయన మాటలకేంలెండి, అవన్నీ ఎప్పుడో మేము పుట్టక మునుపు వాళ్ళూ వీళ్ళూ అనుకున్నవి దీన్నేం పెద్దగా పట్టించుకోకూడదు మీరు రాను రాను మీకే అర్థమౌతుంది మీ మామగారితత్వం!" అంటూ, అదోరకమైన తేలిక ధోరణిలో అంటూ, పెళ్ళికొడుకుని చూసి నవ్వాడు.

పెళ్లికొడును అదోరకంగా నవ్వేసి, అక్కడినుంచి కదిలాడు. భర్తననుసరించింది కల్యాణి.

"చూడండి మామయ్యగారూ, మీ అమ్మాయికి మొగుడూ, మీకు అల్లుడూ వచ్చాడు. ఇకనైనా మీ యీ మాటల ధోరణి మార్చుకోకపోతే బాగుండదు సుమండీ" అని, రామకృష్ణగార్ని కాస్త మందలింపుగా అన్నాడు రమణ్రావు

అన్నాడేగానీ, యిరుసులేని చక్రంలాగ సుళ్ళూ యీయన తెలిసీ తెలియని మాటల్తో ఎవర్ని ఏ గోతిలో పడదోస్తాడోనన్న భయం కూడా వుంది అతనిలో.

"ఇప్పుడు నేనేమిచేశానయ్యా" అంటూ మొహం తెల్లేశారు రామకృష్ణగారు

పాపం ఆయన చేసిన తప్పేమిటో ఆయనకు తెలియదు. 'ఊరికే సరదాగా అన్న మాటలు అంతే' అనుకుంటూ డాయన.

ఓర్చి ఓర్చి, ఆఖరికి తనవాళ్ళు తనని చివాట్లు పెడుతుంటె, అప్పుడు నోరు మెదపకుండా అన్నీ పడ్తాడు.

పాపం, రామకృష్ణగారిలాగ యింకెంత మంది వున్నారో!

అసలు రమణ్రావు ఆయనకు స్వంత సోదరి కొడుకుకాడు. ఏదో బీరకాయ పీచులాగ. ఆ కాస్తకే ఆయన, "నా మేనల్లుడు నా మేనల్లు" డంటూ మురిసిపోయారు.

రమణ్రావు వుద్యోగం గురించి, యీ మేనమామ వున్న వూరికి రావలసి వచ్చింది

తాను, విడిగా ఓ గదిలో వున్నప్పటికీ, తల్లి బలవంతంమీద, యీయన కంట పడాల్సి వచ్చింది

ఇక, అప్పటినుంచి తనని పట్టుకున్నారాయన గాలంలో చిక్కుకున్నట్టు ఐపోయిందతనికి

"వద్దు మొర్రో", అనుకున్నా, ప్రతి ఆదివారం గదికి వచ్చేసి, తనని బలవంతంగా వాళ్ళింటికి భోజనానికి లాక్కుపోయేవారు.

అప్పుడు తనని పక్కన కూర్చోబెట్టుకుని, వాళ్ళమ్మాయి గొప్పతనాలు గీతోపదేశంలా చెప్పుకుపోయేవాడు

ఆ అమ్మాయేమో, "హలో" అని వెళ్ళిపోయేది ఒకనాడు.

"ఏమోయ్ రమణ్రావ్, ఎన్నాళ్ళిలా ఆదివారాలు మా యింటికి భోజనానికి వస్తావ్? మా అమ్మాయి కల్యాణిని పెళ్లి చేసుకుని, హాయిగా యిక్కడే వుండి పోరాదూ?" అంటూ చూశారు

"చచ్చాంరా బాబూ" అనుకున్నాడు రమణ్రావు ఇప్పుడు అసలు సంగతి చెబితే గాని, లాభం లేదనుకున్నాడు చెప్పేశాడు.

"మామయ్యగారూ, మీరు నా గురించి ఏదేదో వూహించు కుంటున్నట్టున్నారు. నాకు మరో అమ్మాయితో పెళ్లి సెటిలైందండీ..." అంటూ, కాస్త సంకోచంగా వున్నా,వినయంతో తన పెళ్లిగూర్చి చెప్పేశాడు రమణ్రావు.




74 సం.గా అఖండ ఖ్యాతిగాంచిన
**నారసింహలేహ్యం**
రిజిష్టర్డు ట్రేడ్ మార్కు
అన్ని రకములైన (ముఖ్యముగా పురుషుల) బలహీనతలను పోగొట్టి రక్త వృద్ధిని, పుష్టిని కలిగించు వాజీకరము.
1 డబ్బా రు. 7—25 పోస్టేజ ప్రత్యేకము.
**పి. శి. ఏ. అండ్ కో.,**
పెరదేపి 523273 [ప్రకాశం జిల్లా]
క్యాటలాగు ఉచితము కోరినవారికి ఏజన్సీలు ఇవ్వబడును.



శుభవార్త
నాడీప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు
డా. ఎస్. ఎస్. రావు, M.B.H., R.M.P.
గారిని సంప్రదించండి :
**రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,**
చింతలబస్తీ, 6-2-961, ఖైరతాబాదు,
హైదరాబాదు-500004 (ప్రీమియర్ కేఫ్ సందులో)

శరీర బలహీనత, పూర్తిగా పెరుగుటగాని, చిన్నప్పటినుండి సన్నగానుండి ఏమందువలన లావు కాకపోవుట అంగములు వుండవలసిన సైజులో వుండక పోవుట, నరములబలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండె దడ, రక్తప్రసరణ ఎక్కువగావడం లేక తక్కువగావడం, సర్వవిధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తి కడుపు ఎత్తుగా పెరగడం, జలోదరం కడుపునొప్పి, గ్యాస్టిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలి చేరుట, స్త్రీల ముట్టు బట్టునొప్పి, కుసుమవ్యాధి [ఏ రంగైనాసరే] మూత్ర వ్యాధులు, మూలశంక వరిబీజం, సుఖవ్యాధులు, స్త్రీలకుగాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకవుపోట, వీపునొప్పి, నడుము నొప్పి, కీళ్ళ వ్యాధులు, వాపు, నీరుచేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనాచర్మము, దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరం, పక్షవాతం, మొదలైన వ్యాధులు దీర్ఘ వ్యాధులుగా పరిణమించినపుడు మాత్రమే వీరు చికిత్సచేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలము : ఉ. 7 గం. నుండి సా. 5 గం. వరకు.
పరీక్ష ఫీజు రు. 12/-. చికిత్సకు అదనం.

ప్రతి నెల క్యాంపు : 4వ తేదీ : కర్నూలు: రవిప్రకాశ్ లాడ్జి—5వ తేదీ : అనంతపురం: హోటల్ సప్తగిరి—6వ తేదీ: గుంటకల్: శ్రీలాడ్జి : 7వ తేదీ కడప : ప్రతాప్ లాడ్జి, స్టేషన్‌రోడ్—8వ తేదీ : తిరుపతి: భీమాస్ అనెక్స్ లాడ్జి— 9, 10 తేదీలు : మద్రాసు: కోమలవిలాస్, 5, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్, (జి.టి.)—11వ తేదీ : నెల్లూరు : రాఘవ విహార్— 12 తేదీగుంటూరు : ఉడిపి శ్రీకృష్ణభవన్, స్టేషన్ రోడ్—13, 14 తేదీలు వైజాగ్ బృందావన్‌లాడ్జి, డాబాగార్డెన్స్ — 15, 16 తేదీలు . రాజమండ్రి : శాంతి నివాస్ లాడ్జి — 17వ తేదీ, కాకినాడ : శాంతినివాస్ లాడ్జి, గవర్నమెంటు హాస్పిటల్ ఎదుట—18, 19 తేదీలు : విజయవాడ : మోడరన్ కేఫ్, గాంధీనగర్ — 20వ తేదీ : వరంగల్ : నటరాజ్ హోటల్— 21వ తేదీ నుండి హెడ్డాఫీస్.

SWASTIK

## మాటలురాని మనిషి

"అదేంటోయ్, చెట్టంత మేనమామని నేనుండగా, నాకో కూతురుండగా..." అంటుండగానే.

"అది అంతేలెండి, యికనే వస్తా" నంటూ, ఆయన ముందు నుంచి లేచి, బయట పడ్డాడు రమణారావు.

ఆ తర్వాత, ఆదివారాలు మామ యింటి భోజనం వుండదేమో అనుకున్నాడు గానీ, రామకృష్ణగారు భోళా మనిషి కావటం మూలాన అలవాటు తప్పకుండా మేనల్లుణ్ణి ఆదివారాలు పిలిచేవాడు.

ఆఖరికి, "ఏమోయ్, రమణారావ్, మా కల్యాణికి సంబంధం కుదిరిందోయ్. నీవు మంచి ఛాన్సు మిస్ చేశావు ఫో" అంటూ నవ్వారు.

"చాలా సంతోషమండీ" అంటూ తన నిజమైన సంతోషాన్ని వ్యక్తం చేశాడు రమణారావు.

రామకృష్ణగారి నిష్కల్మషమైన మనస్తత్వానికి అయనమీద వో రకమైన మర్యాద ఏర్పడింది రమణారావుకి. అందుకే వాళ్లిద్దరి స్నేహమూ విడిపోలేదు.

* * *

మయసభలా అలంకరించివున్న శోభనం గదిలో, ఏదో మాయ జరుగుతుందాఅన్నట్టు కూర్చున్నాడు ప్రభాకర్.

కల్యాణిని లోపలికి నెట్టి, తలుపు మూశారు, అతను ఆ సంగతి గ్రహించాడు కానీ, ఏమీ ఎరుగనట్టు కూర్చున్నాడు.

కల్యాణికి అర్థమైంది పొద్దున్న తన తండ్రి మాటలు, ఇంకా యితని బుర్రలో పనిచేస్తూంది. లేకపోతే, తనని ప్రేమగా చేరదీసుకొనేవాడే! "ఈ నాన్న యెప్పుడూ యింతే" అనుకుంది. లోలోన తండ్రిని విసుక్కుంటూ.

పాలగ్లాసు అందుకుని అతని దగ్గరకు వచ్చింది. "నాకొద్దు" అన్నాడు ముభావంగా.

ఇక యీ బుర్రలోకి చొరబడ్డ చెద పురుగుని తనే హతమార్చాలన్న నిశ్చయాని కొచ్చింది.

"ఎందుకలా వున్నారు?" అందిలాలనగా.

ఆమె వంక ఒకసారి చూసి, చూపు మరల్చాడు ప్రభాకర్.

"నేనంటే యిష్టంలేదా!" అని అడుగు



పసి బిడ్డకు జీర్ణసంబంధమైన
బాధలు కలిగినప్పుడు...



సౌమ్యంగా పనిచేసే
అమృతాంజన్
గ్రైప్ మిక్స్చర్
బాధను అతి త్వరగా తగ్గిస్తుంది

OBM 3410/4 TG




కడుపునొప్పి, అజీర్ణము, వాయువు, పళ్ళు వచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటిలో దేనికైనా సరి. మీ పసిబిడ్డ బాధ పడుతూంటే అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్‌తో అతి త్వరగా ఉపశమనం కల్గించండి త్వరగా సుఖంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది.

గృహౌషధముల తయారుచేయుటలో తరతరాలుగా నమ్మకమునకు పాత్రమైన అమృతాంజన్ వారి తయారి.

అమృతాంజన్
లిమిటెడ్

## మాటలురాని మనిషి

దామనుకుందిగానీ, అతనిలో లేని భావాన్ని కలుగజేసి నటిస్తాతుండేమోనని, ప్రశ్న మార్చేసింది.

"వంట్లో బాగుండలేదా!"

"అదేం లేదు. బాగానే వున్నాను" అన్నాడు.

ఏదో, ఓ జవాబు యిస్తున్నందుకు సంతోషించింది కల్యాణి.

"మరైతే, మాట్లాడకుండా వున్నారు —?"

కల్యాణి అలా అడుగుతుంటె, యిక మాట్లాడాలనుకున్నాడు ప్రభాకర్.

'మనసులో వున్నదే అడిగేస్తే పోలే' అని కూడ అనుకున్నాడు.

అందుకే, యిలా అడిగాడు.

"కల్యాణీ, ప్రొద్దున మీ నాన్న చూపెట్టిన రమణారావుని, నీవు ప్రేమించావా ? అతనితో నీ పెళ్లి కాస్తలో తప్పిపోయిందన్నారు. అదెందువల్ల ? వాళ్ళ తల్లితండ్రు లంగీకరించలేదా ? దానికి నీవు బాధపడుతున్నావా ?"

అలా అడిగేస్తుంటె అతనికి బరువు తగ్గుతున్నట్టుందికానీ, యిప్పుడా బరువు కల్యాణి మనసుకి తగిలింది.

కాస్త ధైర్యం వున్న పిల్ల కాబట్టి క్షణంలో సర్దుకుని తాను అంతా వివరించగలిగింది.

"నా మాట మీద నమ్మకముంచి మీరు వినాలి. లేకపోతే, మీ కన్నీ అబద్ధంగానే తోస్తాయి. అతను మా నాన్న బలవంతంమీద వచ్చేవాడు మా యింటికి. వచ్చినా, అతి మర్యాదగా మెసలుకునేవాడు. ఆ మనిషి మంచితనాన్ని యిష్టించి అతనితో ఎప్పుడో ఒకటి, అరా మాట్లాడేదాన్నిగానీ, అంతకుమించి నా మనసులోగానీ, అతని మనసులోగానీ మరే భావమూ ఏర్పడలేదు. ఆడపిల్ల తండ్రిగా మా నాన్న అనుకునుండవచ్చు, రమణారావుని తన యింటల్లుడుగా చేసుకోవాలని. అందులో తప్పేముంది చెప్పండి! కానీ, ఆయనకు తెలియందల్లా లౌక్యం. కొన్ని సంఘటనలు, జరిగిన నిజాలే అయినా, అవి బయటికి మాట్లాడుకోనివిగా వుంటాయి. పరిస్థితులనుబట్టి, మాటల చతురతను కనబరిచే నైపుణ్యం మా నాన్నగార్కి లేదు. ఎంత చెప్పినా, నేనూ, మా అమ్మా ఎంత నేర్పినా ఆయన తత్వం మారటం లేదు. ఆయనను బాగా తెలిసినవారు ఆయన మాటకి నవ్వేసి వూరుకుంటారు. కానీ, క్రొత్తవాళ్లతోనే యిలాంటి చిక్కులు వస్తుంటాయి. కొన్నాళ్లయితే, మీకూ తెలుస్తుంది ఆయన తత్వం. ఇదీ అసలు సంగతి, నన్ను నమ్మండి."

ఇలాంటి సంఘటన సంభవించినందుకు కల్యాణి నిజంగానే కొంత బాధ పడింది.

ప్రభాకర్ మెదడుకి మేత పడింది. కల్యాణి మాటల్లో అసత్యాలున్నట్లు లేవు. ఆ మాటకొస్తే పెళ్ళికి ముందర ఆడపిల్లకి ఎంత మందినో చూసి, ఆఖరికి ఒకటి కుదురుస్తారు. ఇందులో తప్పేముంది ? ఈ మాట తనకు ముందు స్ఫురించక పోవటం, తన తొందరపాటే ! ప్రభాకర్ కళ్లముందున్న మబ్బు తొలగి, చంద్రబింబం లాంటి కల్యాణి కనిపించింది. ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

* * *

రమణారావుకి విమల ప్రవర్తన ఏమీ నచ్చలేదు. కల్యాణి పెళ్లికి వెళ్లి వచ్చిన దగ్గరనుంచి, ఆమె రమణారావుతో చాల విసురుగా ప్రవర్తిస్తోంది.

గమనిస్తూనే వున్నాడు అతను. చూచీ చూడనట్టు వుంటే అదే సర్దుకుంటుం దనుకున్నాడు.

కానీ, విమలలో మార్పు రాలేదు..మాట మాటకీ భర్తని దెప్పటం మొదలెట్టింది. ఇదివరకులా కాకుండా, ముభావంగా వుండటం మొదలెట్టింది.

"ఎందుకలా వున్నావు?" అన్నాడు ఒకనాడు.

అప్పుడు తలనొప్పి, కడుపునొప్పి — యిలాంటి సాకులు వుండనే వున్నాయి.

ఇంట్లో వున్నది యిద్దరు. ఆయిద్దరూ యిలా యెడ మొహం, పెడ మొహంగా వుండటం రమణారావుకి చాల కంటకంగా వుంది. విమల ముభావత అతను సహించలేక పోతున్నాడు. అతనికి చిరాకు మొదలైంది.

"ఇప్పుడేం కొంప మునిగిందని అలా వున్నావ్?" అన్నాడు కోపంగా.

అతనా ధోరణిలో అడిగేసరికి, విమల మనసులోని భ్రమకు మరింత ప్రాణం పోసి

ళ్ళింది. ఆమెకు వుడుకుమోత్తనం ఎక్కువై, మాట రాలేదు.

"మాట్లాడవేం విమలా."

"నేను మాట్లాడితే ఎంత, మాట్లాడకుంటె ఎంత! మీ కెవరు కావాలో వెళ్లి వాళ్ళతో మాట్లాడుకోండి" విమల మనసులో అక్కసు యిక దాచుకోలేక, బయటపడ సాగింది.

"అంటె, ఏమిటి నీ వుద్దేశ్యం?" ఆశ్చర్యపోయాడు రమణారావు. అతనికి మరో ప్రక్క కోపంగా కూడా వుంది.

"వెళ్ళండి, వెళ్ళి మీ మామయ్యగారమ్మాయితో మనసు విప్పి మాట్లాడుకోండి. తనువులు వేరైనా, మన మనసులు మాత్రం ఒకటే అని విన్నవించుకోండి. నేనిలాగే నిట్టూర్పుతో మిగిలిన జీవితం గడిపేస్తాను."

ఏదో పిచ్చి ఆవేశం, దుఃఖం తన్నావరించినదై, మాటలు ఎలా వస్తున్నాయో కూడ తెలియటంలేదు విమలకి. వో ప్రక్క చిన్న పిల్లలా కళ్ళు తుడుచుకుంటూంది.

రమణారావుకి అసలు సంగతి అర్థమైంది విమల తన్ను యింత అపార్థం చేసుకోవటం, అతనికేమాత్రమూ నచ్చలేదు. "ఆడబుద్ధి పోనిచ్చుకుంది కాదు" అనుకున్నాడు. (మరి, ఆడవాళ్ళకి మగబుద్ధులెలా వస్తాయి!)

"నిన్నటి దినం, వాళ్ళిద్దరూ బజారు వెళ్ళారు అక్కడ కల్యాణి వాళ్ళ నాన్నతో కనిపించింది. అప్పుడు పరస్పరం పలకరించుకున్నారు. కల్యాణి బాగ తెలిసున్న మనిషి కాబట్టి, ఏదో పలకరించకపోతే బాగుండదని, "మీ శ్రీవారు ఎప్పుడు వస్తారు?" అని అడిగాడు నవ్వుతూ.

అతనడిగిన దానికి సమాధానం చెబుతూ, కల్యాణి ఫ్రీగా మాట్లాడింది.

అసలే అనుమానంతో వున్న విమలకు, యిదొక ఆధారంలా దొరికింది.

ఆ మాటకొస్తే, కల్యాణి విమలని కూడ ఏదో మాట్లాడించింది. ఇష్టంలేనట్టు, క్లుప్తంగా సమాధానం యిచ్చి, ముఖం తిప్పుకుంది.

కల్యాణి తాను కొన్నవి చూపెట్టి, "బాగున్నాయా?" అని అడిగింది రమణారావుని.

"నీవు కొన్నవి రమణారావు బాగోలేదని అంటాడా తల్లీ" అన్నారు రామకృష్ణగారు.

"ఫస్ట్‌క్లాస్" అన్నాడు రమణారావు, సహజ ధోరణిలో విమలకు యివన్నీ చూస్తూ, వింటూ అక్కడ నించోబుద్ధి కావటంలేదు.

ఆమె మనసు క్షణక్షణానికీ వో భూత మౌతూంది. మాటలు జోరుకి మిగిలిన ముగ్గురూ హాయిగా నవ్వుకోగలిగారు కానీ, విమల నవ్వలేకపోయింది.

"మా అల్లుడు ఎల్లుండి వస్తాడోయ్. తర్వాత నాల్గు రోజులకి, కల్యాణి వాళ్ళ ఆయనతో వెళిపోతుంది" అన్నారు రామకృష్ణగారు.

"అయితే, మీ యిద్దరూ మా యింటికి డిన్నర్‌కి రావాలి కల్యాణీ. చెప్పు మీ ఆయనతో. నేను మళ్ళా కనిపిస్తాలే" అనేశాడు రమణారావు.

"ఇప్పుడు వీళ్ళనెందుకు భోజనానికి పిలవాలి" అనుకుంది విమల.

ఆ తర్వాత ఎవరిళ్లకు వాళ్ళు వచ్చేశారు

అప్పటినుంచే విమల మరీ తీవ్రంగా వుంటూంది. ఇదే కారణం అనుకున్నాడు రమణారావు.

"విమలా, నువ్వు నన్నిలా అర్థం చేసుకోవటం నా దురదృష్టం" అని మాత్రం చెప్పి, అక్కడినుంచి వెళ్ళిపోయాడు రమణారావు.

కానీ, విమల స్థానంలో వున్నవారికి, భర్తతో యిలాంటి పరిస్థితులెదురైతే, తప్పకుండా మనసు అల్లకల్లోల మౌతూందేమో. దురదృష్టవశాత్తూ పుట్టిన యీ ఆలోచనలకు స్వస్తి చెప్పాలనుకున్నా, రామకృష్ణగారిలాంటివారి అసహజపు మాటలు, అగ్నికి ఆజ్యం పోసినట్టు పనిచేస్తాయి. భార్య మనసులోని యీ ఆరాటాన్ని తెలుసుకున్న రమణారావుకూడ, కల్యాణితో యింక కొంత "రిజర్వ్‌డ్"గా వుండక తప్పదేమో! కానీ మానవ హక్కులు ఒకర్ని ఒకరు శాసించేవికావు. ఎవరి స్వేఛ్ఛ వారికుంటూరు.

అలా అయితే యిలాంటి చిక్కులు ఎలా వీడుతాయో! దైవానుగ్రహం!

ఇష్టం లేకపోయినా, ఆ రోజు అతిథి సత్కారం బాగానే జరిపింది విమల.


పిలవకుండానే రామకృష్ణగారు కూడా వచ్చేశారు. అదేమంటె. "మా అల్లుడింటికి నేను రావాలనుకున్నప్పుడు రావచ్చులే" అనేస్తారు.

"అంతే మావయ్యా" అంటాడు మొహమాటానికైనా రమణారావు కూడా.

భోజనాలయ్యాక, "మీరు వెళ్ళండ్రా, నేను కాసేపుండి వస్తాను" అని, కూతుర్ని అల్లుణ్ణి పంపించేసి, ఆయన ఆగిపోయారు.

"ఎందుకో" అనుకున్నారు రమణారావు దంపతులు.

"అమ్మాయ్, యిలా వచ్చి కూర్చో, నీతో ఒకటి చెప్పాలి" అన్నారాయన విమలని చూస్తూ.



శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కృప పొందిన

"యోగి యాదవ్"

ఆర్యా !

మీ నిత్య జీవితములో తీరని సమస్యలను తమ యొక్క యోగ శక్తితో జయింప చేసి మిమ్ములను ఆశ్చర్య చకితులనుగా చేస్తారు

అనేక ఉన్నత అధికారులు, అభిమానులు "యోగి యాదవ్" విశేష యోగ కృపచే వారి కష్టములనుండి విముక్తులయినారు

మీ మనస్సును క్లేశపరచు సమస్యలలో ఒక్క ప్రశ్నను వివరముగా వ్రాసి 'మీ' యింటి విలాసము 90 పైసల తపాలా బిళ్ళలతో ఈ క్రింది విలాసమునకు పంపిన యడల మీ సమస్యలు తీరు విధమును "యోగి యాదవ్" వివరముగా తెలియజేస్తారు. "యోగి యాదవ్"గారికి పెద్ద పెద్ద అధికారులు పంపిన 'సర్టిఫికెట్లు' (Certificates) యొక్క కాపీ మీకు పంపబడును.

విలాసము : "యోగి యాదవ్"

111, ఆళ్వార్ తిరునగర్ (ఎనక్స్), మద్రాసు-600087.

N. B. మీ ప్రశ్నను ఆంగ్లములో మాత్రమే వివరముగా వ్రాసి పంపవలయును.

ANGEL ADS

ఐటెక్స్ - మాట్ ఫినిష్ తిలకము

నాణ్యతను పరిశోధించి వ్యత్యాసమును చూడండి

ఐటెక్స్ మాట్ ఫినిష్ (EYETEX MATT FINISH) తిలకము మీ మృదువైన చర్మమునకు సరియైనది. మీ అందమును ప్రజ్వలింపజేయును. అనేకమైన మంచి రంగులలో, చర్మమునకు హాని కలగని మంచి సువాసన ద్రవ్యములతో జేయబడినది.

ఇది ఔషధములు మరియు అలంకార వస్తువుల యాక్ట్ మరియు రూల్స్ ప్రకారము - విజ్ఞాన పూర్వకముగా తయారుచేయబడినది.

ఒక్కొక్క ట్యూబులోను 50% ఎక్కువ తిలకము అదే ధరకు దొరుకుటచే చాల పొదుపైనది




EYETEX REGD

33 సంవత్సరముల అనుభవము వేరు విధముగ వుండుటకు వీలులేదు.

ARAVIND LABORATORIES MADRAS-600 033

## మాటలురాని మనిషి

జంకుతూ వచ్చి కూర్చుంది విమల. రమణారావూ అక్కడే వున్నాడు

"చూడమ్మాయ్, మా కల్యాణిమొగుడు లేడూ, నాకు నిజంగా అల్లుడేనమ్మా ఆ రోజు ఏదో సరదాగా అన్నానా పెళ్ళిలో, "మా కల్యాణికి (రమణారావుకి) నీ మొగుడికీ పెళ్ళి కావల్సింది" అని, దాంతో అమ్మాయితో మాట్లాడ్డం మానేశాడుట– ఆ మొదటిరాత్రి ఉట్టి మూర్ఖుడు. అంత మాత్రానికే అలా గీర్వాణం చూపాలా. అమ్మాయి ఎంతో కష్టం మీద అతని మనసు మార్చిందిట మర్నాడు తల్లీ కూతుళ్లు కలసి, నన్ను దులిపేశారనుకో. నోరుమూసు క్కూర్చున్నాను ఇందులో నా తప్పేమైనా వుందా చెప్పుతల్లీ, వాళ్లబుర్ర తిరుగుడు గాకపోతే."

ఆ మాటలు వింటున్న విమలకు, తానెటో గాలిలోకి ఎగురుతున్నట్టుగా అనిపించింది ముసలాయన తెలియక చేసినా, మొత్తానికి తనకు 'బ్రైన్ వాష్" కూడా చేసినట్టున్నాడు.

సిగ్గుగా రమణారావు వంక చూసింది.

అతను విమలలో వస్తున్న మార్పుని చూసి, ఎంతో బరువు దిగినవాడిలా కనిపించాడు

చిరునవ్వు నవ్వుతున్న భర్త మొహం నిష్కల్మషంగా కనిపించింది విమలకు.

కళ్లలో క్షమించమని అభ్యర్ధన !

"ఏమ్మా నువ్వేమంటావ్. తప్పు నాదేనా" అని అడిగారు ముసలాయన.

"అబ్బె లేదండి, తప్పంతా వాళ్లదే" అంది అప్రయత్నంగా.

"మా తల్లికదే, నువ్వన్నా నా పక్షమున్నావు ఇక నేను వస్తానమ్మా, యిది నీకు చెప్పాలనిపించింది. చెప్పేదాక మనసాగ లేదనుకో అందుకే మావాడు పిలవక పోయినా, వచ్చేశాను" అంటూ లేచారు.

"ఫరవాలేదులెండి" అంది ప్రసన్నంగా విమల

"ఇక మామధ్యనుంచి నువ్వు తప్పుకుంటే మంచిది మామయ్యా" అని మనసులో అనుకుంటూ. "జాగ్రత్తగా వెళ్ళు మామయ్యా" అంటూ, ఆయన్ని సాగనంపి, లోపలికి వచ్చాడు రమణారావు.